క్లుప్తంగా

నగరంలో 30 పోలీస్ యాక్ట్

విజయవాడస్పోర్ట్స్: శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా 30 పోలీస్ యాక్ట్‌ను నగరంలో అమలు చేస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె.రాణా శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 6వ తేదీ నుంచి మార్చి 31వ తేదీ వరకు ఆంక్షలు అమలులో ఉంటాయని తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా వీటిని విధిస్తున్నట్లు వెల్లడించారు. ఆంక్షల సమయంలో పోలీసు ముందస్తు అనుమతి లేకుండా నగరంలో సభలు, సమావేశాలు, ఊరేగింపులు, నిరసనలు, ధర్నాలు, చేయొద్దని హెచ్చరించారు.

ప్రతి ఒక్కరూ సేవల్లో భాగస్వాములుకావాలి



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): పర్వదినాల్లో ప్రతి ఒక్కరూ సేవల్లో భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి పిలుపునిచ్చారు. హెల్ప్ ది హోప్‌లెస్ సేవా సంస్థ ఆధ్వర్యాన శుక్రవారం చిట్టినగర్ సొరంగం రోడ్డులోని విశ్వబ్రాహ్మణ కల్యాణ మండపం వద్ద పేదలకు అన్నదానం చేశారు. ముఖ్యఅతిథులు ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, మేయర్ రాయన భాగ్యలక్ష్మితోపాటు కార్పొరేటర్లు శిరంశెట్టి పూర్ణచంద్రరావు, ఉమ్మడి చంటి అన్నదానాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు ఈదులూరి రాధాకృష్ణ, ట్రాక్టర్ రాము, రాజ్‌భవన్ ఆఫీసర్ డాక్టర్ ఎంవీవీఎస్ఎస్ మూర్తి, సిటీ కాంగ్రెస్ మైనార్టీ చైర్మన్ షేక్ ఖాజా, నమ్మి అప్పారావు, బొబ్బిలి లీలా కుమార్, రిటైర్డ్ ఇంజినీర్ డీఎస్ చలం తదితరులు పాల్గొన్నారు.

జాతీయ టెబుల్ టెన్నిస్ పోటీలకు నగర క్రీడాకారులు



విజయవాడ స్పోర్ట్స్: సీబీఎస్ఈ స్కూల్స్ జాతీయ టెబుల్ టెన్నిస్ పోటీలకు ప్రాతినిధ్యం వహించే రాష్ట్ర జట్టులో నగర క్రీడాకారులు డి.ప్రీతిక, ఎం.చార్వి స్థానం దక్కించుకున్నారు. ఈ నెల తొమ్మిది నుంచి 13వ తేదీ వరకు పెద్దాపురంలోని ప్రకాస్ సైనర్జీ స్కూల్‌లో జరిగే జాతీయ పోటీల్లో ఇద్దరు క్రీడాకారులు పాల్గొంటారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని క్రీడాకారులను టీటీ కోచ్‌లు బి.శ్రీనివాస్, షేక్ అక్రమ్, షేక్ గౌస్‌బాషా, ఏపీ టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ కార్యదర్శి పి.విశ్వనాథ్, కృష్ణాజిల్లా కార్యదర్శి కె.బలరాం అభినందించారు.

బహుభాషా గాయకుడు మాధవపెద్ది సత్యం



విజయవాడ కల్చరల్: బహుభాషా గాయకుడు మాధవపెద్ది సత్యం అని తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు అన్నారు. తెలుగు కళావాహిని, ఆంధ్ర ఆర్ట్స్ అకాడమీ, శ్రీ కళాభారతి సంస్థల ఆధ్వర్యాన గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో శుక్రవారం గాయకుడు మాధవ పెద్ది సత్యం శత జయంతి సభ, సినీ నటుడు సత్యనారాయణకు స్వరనీరాజనం కార్యక్రమం నిర్వహించారు. చిట్టిబాబు మాట్లాడుతూ గాయకుడు మాధవపెద్ది సత్యం తెలుగు, హిందీ, తమిళం, కన్నడ భాషలో ఏడు వేలకు పైగా పాటలు పాడినట్లు తెలిపారు. ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాల అధ్యాపకుడు డాక్టర్ శేషుబాబు సినీ నటుడు సత్యనాయణ సినీ రంగసేవలను వివరించారు. ఎక్స్‌రే సాహిత్యసేవా సంస్థ ప్రధాన కార్యదర్శి ఆంజనేయరాజు ప్రసంగించారు. దుర్గాప్రసాద్, మోహన్‌రాజ్, డానియల్, పావని. దుర్గానాగమణి, విజయశ్రీ గుప్తా చిత్రగీతాలను ఆలపించారు.

ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులపై వేధింపులు ఆపాలి

ఆర్టీసీ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఏపీ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్ (ఏపీ పీటీడీ)లో పని చేస్తున్న ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులపై అగ్రవర్ణానికి చెందిన ట్రేడ్ అసోసియేషన్స్ వేధింపులు ఆపాలని ఏపీఎస్ఆర్టీసీ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు శుక్రవారం విద్యాధరపురం ఆర్టీసీ డిపో సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ జీసీహెచ్ కోటయ్య, రాష్ట్ర కోశాధికారి డీవై కొండలు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



విద్యాధరపురం షాదీఖానాలో కొత్తగా మంజూరైన పెన్షన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి తదితరులు



పెన్షన్ కార్డులు చూపిస్తూ హర్షం వ్యక్తం చేస్తున్న పింఛనర్లు

- పెన్షన్ పెంపుతో అవ్వాతాతలకు భరోసా
- పెన్షన్ వారోత్సవాల్లో ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. విద్యాధరపురం షాదీఖానాలో శుక్రవారం పెన్షన్ వారోత్సవాలు నిర్వహించారు. ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు లబ్ధిదారులతో కలిసి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. 34, 35, 39, 40, 41, 42, 43, 44, 45, 55, 56 డివిజన్లలో కొత్తగా మంజూరైన పెన్షన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన తొలి రోజే అవ్వాతాతల పెన్షన్ పెంచుతూ పోతానని హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ఇచ్చిన హామీ మేరకు ఏటా రూ. 250 చొప్పున పెంచుతున్నారని తెలిపారు.

ఈ నెలలో అవ్వాతాతలు, వితంతువులు, వికలాంగులు, ట్రాన్స్‌జెండర్లకు రూ. 2750 పెన్షన్ అందుకుంటున్నారని తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాట తప్పని, మడమ తిప్పని నాయకుడని కొనియాడారు. పెన్షన్ పెంపుతో అవ్వాతాతలకు భరోసా ఏర్పడిందన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని తెలిపారు. గతంలో టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీల పేరుతో చంద్రబాబు ప్రజలను నిలువునా మోసం చేశారని ఆరోపించారు. బాబు హయాంలో వచ్చే అరకొర పెన్షన్ తీసుకోవడానికి దూరం వెళ్లాల్సి వచ్చేదని, ఎప్పుడు వచ్చేదో కూడా తెలిసేది కాదన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పెన్షన్ పెంచి వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రతి నెలా ఒకటో తేదీ సూర్యోదయాని కంటే ముందే పెన్షన్ అందిస్తున్నామని వివరించారు. కరోనా సమయంలో కూడా సంక్షేమ పథకాలు ఇచ్చిన వ్యక్తి జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. అభివృద్ధి కావాలంటే సైకిల్ పోవాలని కోరుకున్న చంద్రబాబు ఇక ఇంటికే పరిమితమవుతారని పేర్కొన్నారు. చంద్రబాబు వస్తే కరువు, కాటకాలు వస్తాయని తెలిపారు. జగనన్న ప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లలా భావిస్తున్నారన్నారు. కార్యక్రమంలో మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఆయా డివిజన్ల కార్పొరేటర్లు, వీఎంసీ అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

వైభవంగా శివముక్కోటి



ఉత్తరద్వారంలో దర్శనమిస్తున్న భ్రమరాంబ మల్లేశ్వరస్వామి



స్వామి వారికి అన్నాభిషేకం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వన్‌టౌన్‌లోని పురాతన ఆలయం శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం (పాతశివాలయం)లో శివ ముక్కోటి వేడుకలు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. స్వామి వారి జన్మనక్షత్రమైన ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకొని విశేష వైదిక కార్యక్రమాలు జరిగాయి. గురువారం అర్ధరాత్రి స్వామి వారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు ఇతర వైదిక కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. శుక్రవారం తెల్లవారుజామున ఉత్సవమూర్తులకు ప్రత్యేక అభిషేకాలు చేశారు. మహేశ్వరుడికి విశేష అలంకారం చేసి ఉత్తర ద్వార దర్శనానికి అనుమతించారు. ఆలయంలో స్వామి వారికి అన్నాభిషేకం జరిగింది. ఆరుద్ర నక్షత్రంతో పాటుగా స్వామి వారికి ప్రీతికరమైన పౌర్ణమి కలిసి రావటంతో భక్తులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. వైదిక కార్యక్రమాలను ఆలయ ప్రధానార్చకులు రాచకొండ సుమంతశర్మ నిర్వహించగా ఆలయ అధికారులు పర్యవేక్షించారు.

దర్భేశ్వరస్వామి దేవస్థానంలో..

కొత్తపేటలోని దర్భేశ్వరస్వామి దేవస్థానంలో ఆరుద్ర నక్షత్ర అభిషేక మహోత్సవాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామి వారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు చేశారు. అనంతరం స్వామి వారి సన్నిధిలో శాంతి హోమం జరిగింది. అమ్మవారికి ప్రత్యేకంగా శ్రీచక్రనవావరణార్చన నిర్వహించారు. కార్యక్రమాలను అర్చకుడు మురళి చేశారు.

మరింత మెరుగ్గా పారిశుద్ధ్య పనులు



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): పారిశుద్ధ్య పనులు మరింత మెరుగ్గా చేపడుతూ డివిజన్‌ను నగరంలోనే ఉత్తమంగా తీర్చిదిద్దడానికి సిబ్బంది కృషి చేయాలని 48వ డివిజన్ కార్పొరేటర్ అత్తులూరి ఆదిలక్ష్మి పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని ఈద్గామహల్ రోడ్డులోని శానిటరీ డివిజన్ కార్యాలయంలో రూ. 1.30 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులు పూర్తి కావడంతో శుక్రవారం ప్రారంభించారు. కార్పొరేటర్ ఆదిలక్ష్మి శానిటరీ కార్యాలయాన్ని రిబ్బన్ కట్ చేశారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు పిల్లా సూరిబాబు(జగ్గు), శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరసింహ, మేస్త్రి నరసింహ, డివిజన్ నాయకులు కోళ్ల రజని, వరలక్ష్మి, బాయన అమర్‌నాథ్, గాలి గురుప్రసాద్ పాల్గొన్నారు.

దుర్గమ్మ దర్శనానికి కర్నాటక భవానీలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను కర్నాటకకు చెందిన పలువురు భక్తులు శుక్రవారం దర్శించుకున్నారు. కర్నాటకలోని పలు ప్రాంతాల నుంచి ఇంద్రకీలాద్రికి తరలివచ్చిన వందలాది మంది భవానీలు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

సత్ప్రవర్తనతో మెలగాలి

పటమట(విజయవాడతూర్పు): విద్యార్థులు సత్ప్రవర్తనతో మెలగాలని సైకాలజిస్ట్ జగదీష్ అన్నారు. పటమట జెడ్పీ ఉన్నత పాఠశాల్లో యువజన సర్వీసుల శాఖ(క్రిషి) ఆధ్వర్యంలో ు పర్సనాలిటీ డెవలప్‌మెంట్, కెరీర్ గైడెన్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మొక్కలపైనే మానవ మనుగడ

గుణదల (విజయవాడ తూర్పు): మానవ మనుగడ పర్యావరణంపై ఆధారపడి ఉందని, పర్యావరణ పరిరక్షణకు మొక్కలు కీలక పాత్ర పోషిస్తాయని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. గుణదల సెయింట్ జాన్స్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ ఆవరణలో శుక్రవారం కదంబ ట్రీ ప్లాంటేషన్ కార్యక్రమం జరిగింది. కమిషనర్ మాట్లాడుతూ పర్యావరణాన్ని సమతుల్యం చేయడానికి చెట్లు కీలక భూమిక పోషిస్తాయని తెలిపారు. ఆధునిక ప్రపంచంలో కాలుష్యం కారణంగా పర్యావరణంలో పెను మార్పులు చోటుచేసుకుంటున్నాయని పేర్కొన్నారు. అనంతరం పాఠశాల కరెస్పాండెంట్ సుమన్ త్యాగరాజ్ మాట్లాడుతూ విద్యార్థులకు పర్యావరణంపై అవగాహన కల్పించడానికి పలు సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కదంబ అను పేరు గల మొక్క ద్వారా మానవాళికి ఎంతో మేలు చేకూరుతోందన్నారు. ఈ మొక్క ప్రయోజనాలను వివరిస్తూ ప్రదర్శించిన ఎగ్జిబిట్ కు తమ పాఠశాల 6వ తరగతి విద్యార్థి జి దాశ్రితకు సైన్స్ కాంగ్రెస్-2023 జాతీయ స్థాయిలో గుర్తింపు లభించిందని తెలిపారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో కదంబ మొక్కను నాటి నీరు పోశారు. ఈ మొక్క ఆవశ్యకతను వివరిస్తూ విద్యార్థులు ర్యాలీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కె.రామభారతి, వైస్ ప్రిన్సిపాల్ తరుణ్, ఎన్టీఆర్ కాలనీ ప్రెసిడెంట్ సుబ్బారావు, సుంకర రాజేష్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

టీఎంహెచ్ పాఠశాల విద్యార్థులకు నోట్ పుస్తకాల వితరణ

భవానీపురం(విజయవాడపశ్చిమ): చిట్టినగర్ 47వ డివిజన్ పరిధిలోని టేనర్‌పేటలో టీఎంహెచ్ స్కూల్ విద్యార్థులకు వెంకట్ మహేశ్వర్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు శుక్రవారం నోట్ పుస్తకాలు, పెన్నులు వితరణ చేశారు. శ్రీసాయి అన్నక్షేత్రం, శ్రీసాయిబాబా మందిరం వ్యవస్థాపకులు మహేష్ బాబా సౌజన్యంతో నిర్వహించిన కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ దుర్గా కిషోర్ మాట్లాడుతూ ఈ పాఠశాలలో చదువుకున్న తాను ఇప్పుడు తన తండ్రి పేరుతో స్థాపించిన ట్రస్ట్ ద్వారా పేద విద్యార్థులకు సహాయపడటం గర్వంగా ఉందన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజేంద్రబాబు మాట్లాడుతూ పూర్వ విద్యార్థిగా దుర్గా కిషోర్ తమ స్కూల్ విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేయటం ఇది రెండో సారన్నారు. ఇటువంటి సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న ట్రస్ట్ నిర్వాహకులు అభినందనీయులన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు శామ్యూల్, జ్యోతి, మెర్సీ, ఝాన్సీ, క్లర్క్ యోగేష్, ట్రస్ట్ సెక్రటరీ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందిస్తున్న హెచ్‌ఎం రాజేంద్రబాబు, దుర్గా కిషోర్

మార్పులను గమనిస్తేనే భవిత

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): మార్పులను గమనిస్తూ ముందుకు సాగితేనే అత్యుత్తమ భవిత సొంతమవుతుందని వ్యక్తిత్వ వికాస నిపుణులు డాక్టర్ ప్రొఫెట్రావ్ మొహతె అన్నారు. కేబీఎన్ కళాశాల ఐక్యూఏసీ, భారతీయ యువశక్తి ట్రస్ట్ (ఢిల్లీ) సంయుక్త ఆధ్వర్యంలో మెంటర్‌షిప్ శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం ఆ కళాశాల ప్రాంగణంలో ప్రారంభించారు. ప్రొఫెట్రావ్‌మొహతె మాట్లాడుతూ విద్యార్థులను సమర్థంగా తీర్చిదిద్ది సమాజానికి అవసరమైన శక్తులుగా అందించే క్రమంలో అధ్యాపకుల పాత్ర అత్యంత కీలకమైందన్నారు. ప్రపంచవ్యాప్తంగా అన్ని రంగాల్లోనూ విప్లవాత్మకమైన మార్పులు చోటు చేసుకుంటున్నాయన్నారు. విజయవంతమైన ప్రయాణాన్ని కొనసాగించేందుకు విద్యార్థులకు మరింత సమర్థమైన బోధన అవసరమన్నారు. ఆ క్రమంలో అధ్యాపకులు తమను తాము చక్కగా తీర్చిదిద్దుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, పీఎల్ రమేష్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ హ్యాండ్‌బాల్ పోటీలకు హిందూ హైస్కూల్ విద్యార్థిని

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): త్వరలో రాజస్థాన్‌లోని దిద్వానాలో జరిగే జాతీయ జూనియర్ హ్యాండ్ బాల్ చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొనే ఏపీ జట్టుకు తమ పాఠశాల విద్యార్థిని పుష్ప ఎంపికైనట్లు కొత్తపేట హిందూహైస్కూల్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు తెలిపారు. పాఠశాల కార్యదర్శి కేవీవీ మోహనరావు విద్యార్థినిని, వారిని తీర్చిదిద్దిన ఉపాధ్యాయులు ఎంవీ సత్య ప్రసాద్, ఎస్.లక్ష్మిని అభినందించినట్లు వివరించారు.

ప్రజారవాణా సంస్థలో ఉద్యోగులకు అవార్డులు



బస్టాండ్(విజయవాడ పశ్చిమ): ప్రజారవాణా సంస్థ విజయవాడ డిపోలో పని చేస్తూ విధి నిర్వహణలో ఇంధనాన్ని ఆదా చేసిన ఉద్యోగులకు శుక్రవారం ఆర్టీసీ అధికారులు అవార్డులను అందచేశారు. విజయవాడ మెయిన్ డిపోలో నిర్వహించిన కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిడుగు వెంకటేశ్వరరావు పాల్గొని 2019-2020, 2020-2021 సంవత్సరాల్లో ఇంధన పొదుపులో ఉత్తమ ప్రతిభ కనపరిచిన డ్రైవర్లు, అత్యుత్తమ పనితీరును కనబర్చిన గ్యారేజీ సిబ్బందికి రివార్డులను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రజారవాణా సంస్థ అధికారి డీవై దానం, డిప్యూటీ సీటీఎం సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతన పెంపొందించుకోవాలి



భవానీపురం(విజయవాడపశ్చిమ): యువత ఆధ్యాత్మిక చింతన పెంపొందించుకోవాలని ఎన్టీఆర్ జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. సింహాచల దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ సభ్యులు, 47వ డివిజన్ వైఎస్సార్ సీపీ అధ్యక్షులు కూరాకుల నాగ రూపొందించిన సింహాద్రి అప్పన్న నూతన సంవత్సర క్యాలెండర్‌ను వెలంపల్లి ఆవిష్కరించారు. కార్యక్రమంలో శ్రీశైల దేవస్థానం పాలకమండలి సభ్యుడు గురుమహంత్ మహేష్, శ్రీకాళహస్తి దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ సభ్యుడు కేసరి సుబ్బారెడ్డి(చిన్నోడు), వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి బోయళ్ల రాజేష్, వైఎస్సార్ సీపీ నగర సహాయ కార్యదర్శి తాండ్ర ఇంద్ర కుమార్,మైనార్టీ నాయకులు రషీద్ తదితరులు పాల్గొన్నారు.

● నాన్నా.. నేనున్నా..



అనుబంధం అనే కోవెలకు తొలి దైవం నాన్న. అంగవైకల్యం ఎదుర్కొంటున్న ఆ నాన్న ఎటువంటి పని చేయలేక కుటుంబ పోషణ కోసం యాచన చేయడానికి తన చిన్నారి కుమారుడితో నడిరోడ్డుపైకి రావడం.. తండ్రి ఇబ్బంది పడుతుండటంతో ఆ పసిహృదయం తల్లడిల్లి గుండెకు హత్తుకోవడాన్ని 'సాక్షి' క్లిక్‌మనిపించింది. కృష్ణలంక రాణిగారితోటలో శుక్రవారం ఈ దృశ్యం కనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

రోడ్డు పనుల నాణ్యత పరిశీలన

పటమట(విజయవాడతూర్పు): అభివృద్ధి పనుల్లో కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా శుక్రవారం కమిషనర్ సర్కిల్ -3 పరిధిలోని 15, 16 డివిజన్లలో పర్యటించారు. 15వ డివిజన్‌లోని వెలగపూడి సుబ్బారావు క్రాస్ రోడ్స్‌లో సి.సి. రోడ్లను, రీబౌండ్ హ్యామర్‌తో పనుల నాణ్యతను, రోడ్డు లోతు పరిమాణ నిబంధనలను స్వయంగా పరిశీలించారు. 15వ డివిజన్‌లోని పార్కులో అభివృద్ధి పనుల బిల్లులను చూశారు. 16వ డివిజన్ రామలింగేశ్వరనగర్‌లో 10 ఎ.ఎల్.డి సూయేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్‌ను పరిశీలించి అధికారులను వివరాలు అడిగి పలు సూచనలు చేశారు. ప్లాంట్‌లో నిర్మించిన టాయిలెట్స్, కాంపౌండ్ వాల్ నిర్మాణం, తలుపులు, కిటికీలను మార్చడం వాటన్నింటినీ పరిశీలించి, పంపింగ్ హౌస్‌కు పెయింటింగ్స్ వేయాలని, లోపల గ్రీనరీని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ పర్యటనలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు చంద్రశేఖర్, ఎ.ఎస్.ఎన్ ప్రసాద్, ఎ.డి.హెచ్ శ్రీనివాస్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



రోడ్డును పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్

అవకాశాలు అందిపుచ్చుకోవాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకుంటూ అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. భాగ్యలక్ష్మి సూచించారు. మాచవరం ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం కమిషనరేట్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్, రెడ్‌రోప్ స్వచ్ఛంద సంస్థ కాలేజీ ఇంక్లూజివ్ కమిటీ సంయుక్త ఆధ్వర్యాన గ్లోబల్ లీడర్‌షిప్ సమ్మిట్ జరిగింది. ఆమె మాట్లాడుతూ విద్యార్థుల్లో మానసిక ధైర్యం పెంచడానికి, వారికి ఉన్న అవకాశాలు తెలియ చేయటానికి కార్యక్రమం దోహద పడుతుందన్నారు. విద్యార్థుల్లో వ్యక్తిత్వ వికాసం పెంపొందించడానికి కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్, రెడ్‌రోప్ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్.క్రిసోలైట్ గ్లోబల్ లీడర్‌షిప్ సమ్మిట్ ఏర్పాటు చేశారన్నారు. రిసోర్స్‌పర్సన్ బినూ వర్గీస్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్, వీడియోల ద్వారా భయాలను ఎలా ఎదుర్కోవాలి, తిరస్కరణలను వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన పలు సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో సమన్వయకర్త టీవీ వకులప్రియ, దిల్‌షాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మేలు చేయడమే లక్ష్యం

ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, కార్పొరేటర్ విజయ్‌కుమార్

విద్యాధరపురం(విజయవాడపశ్చిమ): ఇళ్లు లేని పేదవారు ఉండకూడదనే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇళ్ల స్థలాలు ఇచ్చారని, పేదలకు మేలు చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు చెప్పారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక 49వ డివిజన్ కార్పొరేటర్ బుల్లా విజయ్‌కుమార్‌తో కలసి 169వ సచివాలయంలో పర్యటించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయో లేదో అడిగి తెలుసుకున్నారు. స్థానిక సమస్యలపై అధికారులతో మాట్లాడారు. అనంతర ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులకు సంక్షేమ పథకాలు సక్రమంగా అందాలనే జగనన్న లక్ష్యానికి అనుగుణంగా సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ప్రజలకు సేవలు అందిస్తున్నారన్నారు. డివిజన్‌లో ఇప్పటికే రోడ్లు, సైడు డ్రైన్ల నిర్మాణాలు పూర్తి చేసినట్లు తెలిపారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందని వారు దరఖాస్తు చేసుకుంటే వెంటనే అందిస్తారని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజల్లో వస్తున్న ఆదరణ చూడలేక చంద్రబాబు నాయుడు పిచ్చిపట్టినట్లు మాట్లాడుతున్నాడని విమర్శించారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ రాష్ట్రంలో అశాంతి సృష్టించి ప్రజలల్లో అభద్రత భావం పెంచేందుకు విశ్వప్రయత్నం చేస్తున్నారన్నారు. ప్రజలు జగన్‌మోహన్‌రెడ్డితోనే ఉన్నారని ధీమా వ్యక్తం చేశారు. చంద్రబాబుకు 2019లోనే కౌంట్‌డౌన్ అయ్యిందని, భవిష్యత్తులో ఇంటికే పరిమితమవ్వనున్నారని చెప్పారు. కొడుకు లోకేష్, దత్తపుత్రుడు పవన్‌కల్యాణ్‌లతో తనకు అధికారం రాదని మతిభ్రమించిన చంద్రబాబుకు పిచ్చి ఆసుపత్రిలో చికిత్స చేయించాలన్నారు. అనంతరం సచివాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు బూదాల శ్రీనివాసరావు, ఎర్రజొన్న విజయలక్ష్మి, జార్జి తదితరులు పాల్గొన్నారు.